సాక్షి సూర్యాపేట

శనివారం । 27 । సెప్టెంబర్ । 2025

I



మధురం.. సీతాఫలం

మధుర సీతాఫలాల సీజన్ మొదలైంది. ఈ పండ్లు ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయి.

- IIలో



యువత చేతుల్లోనే..

దేశ భవిష్యత్‌ను మార్చగలిగే శక్తి యువత చేతుల్లోనే ఉందని టీవీవీ రాష్ట్ర అధ్యక్షుడు నాగయ్య అన్నారు.

- IIలో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : 590 అడుగులు		
ప్రస్తుత నీటి మట్టం	:	587.40 అడుగులు
ఇన్‌ఫ్లో	:	2,77,119 క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	2,73,641 క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	33,130 క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	8,529 క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	నిల్
ఏఎమ్మార్పీకి	:	1,800 క్యూసెక్కులు
వరద కాల్వకు	:	నిల్

న్యూస్‌రీల్

నల్లగొండ ఎస్పీగా పనిచేసిన శివధర్‌రెడ్డి

- డీజీపీగా నియామకం



శివధర్‌రెడ్డి

నల్లగొండ: రాష్ట్ర నూతన డీజీపీగా నియమితులైన శివధర్‌రెడ్డి గతంలో పూర్వ నల్లగొండ జిల్లా ఎస్పీగా పనిచేశారు. 1994 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శివధర్‌రెడ్డి నల్లగొండ ఎస్పీగా 2000 ఏప్రిల్ 1 నుంచి 2002 ఏప్రిల్ 15 వరకు పనిచేశారు. నక్సల్స్ కార్యకలాపాలను అరికట్టడం, గ్యాంగ్‌స్టర్‌లను అణచివేయడంలో ఆయనకు మంచి పేరుంది. శివధర్‌రెడ్డి స్వస్థలం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం కాగా.. భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లి ఆయన అత్తగారి ఊరు. శివధర్‌రెడ్డి.. టీఆర్‌ఎస్ పార్టీ వ్యవస్థాపక సభ్యుడు, సీనియర్ నాయకుడు దివంగత క్లెం యాదగిరిరెడ్డి అల్లుడు.

జీజీహెచ్‌లో ఇద్దరు ఉద్యోగుల సస్పెన్షన్

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో డబ్బులు దండుకున్న ఇద్దరు ఆస్పత్రి ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. జనరల్ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఏడీ (అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్) నెహ్రూ నాయక్, సీనియర్ అసిస్టెంట్ వేణు ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొంత మంది నుంచి రూ.లక్షల్లో వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. దీనిపై కలెక్టర్ విచారణ చేపట్టడంతో సదరు వ్యక్తులు అవినీతికి పాల్పడినట్టు తేలింది. దీంతో కలెక్టర్ ఆ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్టు ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రవణ్‌కుమార్ శుక్రవారం మీడియాకు తెలిపారు.

సీనియర్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్‌కు పదోన్నతి



రాధాకృష్ణ చౌహాన్

హుజూర్‌నగర్ : హుజూర్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి రాధాకృష్ణ చౌహాన్‌కు పదోన్నతి లభించింది. ఆయనకు అదనపు జిల్లా న్యాయమూర్తిగా పదోన్నతి కల్పిస్తూ తెలంగాణ హైకోర్టు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాధాకృష్ణ చౌహాన్‌కు పదోన్నతి లభించడంపై హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

మహిళలు వైద్యపరీక్షలు చేయించుకోవాలి

గరిడేపల్లి : మహిళలు వైద్యపరీక్షలు చేయించుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ చంద్రశేఖర్ అన్నారను. గరిడేపల్లి పీహెచ్‌సీలో కొనసాగుతున్న మహిళల హెల్త్ క్యాంపును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఆసుపత్రికి సంబంధించిన అన్ని జాతీయ కార్యక్రమాల రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులు క్రమం తప్పకుండా చెకప్స్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ శ్రావణి, డాక్టర్ నరేష్, సూపర్‌వైజర్ అంజయ్య గౌడ్, వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

- శ్రీమహాలక్ష్మీగా సంతోషిమాత



దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఐదవ రోజు సూర్యాపేట పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయంలో అమ్మవారు శ్రీమహాలక్ష్మీగా భక్తులకు దర్శనం ఇచ్చారు. - సూర్యాపేట

రక్తపోటు అధికమే!

- పెరుగుతున్న అధిక రక్తపోటు బాధితులు
- జూలై నుంచి నిర్వహిస్తున్న పరీక్షల్లో 85,608 మంది గుర్తింపు
- శారీరక శ్రమ లేకపోవడమే కారణమంటున్న వైద్యనిపుణులు
- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కొనసాగుతున్న ప్రత్యేక శిబిరాలు



చింతలపాలెం మండలం మల్లారెడ్డిగూడెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తిరుమలగిరి (తుంగతుర్తి): మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ కొరవడిన కారణంగా పలువురు అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ– నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్) బారిన పడుతున్నారు. ఇందులో ప్రధానంగా అధిక రక్తపోటు (బీపీ) ఎక్కువగా విస్తరిస్తోంది. దీని బారిన పడిన వారు వయస్సుతో నిమిత్తం లేకుండా నిత్యం మాత్రలు వేసుకోవాల్సి వస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా వంద కోట్ల మంది, అలాగే మనదేశంలో 30 శాతం మంది అధిక రక్తపోటుతో బాధపడుతున్నట్లు ప్రపంచ ఆరోగ్య సంస్థ గ్లోబల్ హైపర్ టెన్షన్ నివేదికలో ప్రకటించింది. జిల్లాలోనూ రక్తపోటు బాధితులు రోజురోజుకూ పెరుగుతున్నారు.

జీవన శైలి, వ్యాధుల లెక్కలు..

వైద్య ఆరోగ్య శాఖ పర్యవేక్షణలో నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ కార్యక్రమంలో భాగంగా జూలై 1 నుంచి జిల్లాలో 4,33,608 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో 85,608 మంది రక్తపోటు బాధితులు ఉన్నట్లు గుర్తించారు. రోజు రోజుకూ యువతీ యువకులు సైతం అధిక రక్తపోటు బారిన పడుతున్నట్లు వైద్యులు గుర్తిస్తున్నారు. గతంలో పాఠశాలలో రెండు డ్రిల్ పీరియడ్లలో ఆటల పోటీలు ఆడించేవారు. ఇప్పుడు క్రీడా స్థలాలు లేక ఆటలు ఆడించడం తగ్గింది. దీనికితోడు శారీరక శ్రమ లేకపోవడంతో ఈ జబ్బులు వస్తున్నాయని వైద్యనిపుణులు చెబుతున్నారు.

ఎన్‌సీడీ క్లినిక్‌లో పరీక్షలు

ఎన్‌సీడీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 30 సంవత్సరాలు పైబడిన వారందరికీ జాతీయ ఆరోగ్య మిషన్ పథకంలో పరీక్షలు చేస్తున్నారు. జిల్లాలో 23 పీహెచ్‌సీలు, 4 యూపీఎస్సీలు ఉన్నాయి. వీటితో పాటు ఆరోగ్య ఉప కేంద్రాల్లో పరీక్షలు కొనసాగిస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందజేస్తున్నారు.

కారణాలు ఇవే..

మానసిక ఒత్తిడి, సరియైన శారీరక శ్రమ లేకపోవడం, భోజనంలో ఎక్కువగా ఉప్పు వినియోగం, విశ్రాంతి, నిద్ర కొరవడడం లాంటివి అధిక రక్తపోటుకు దారితీస్తాయి.

అవగాహన కల్పిస్తున్నాం



అధిక రక్త పోటుకు గురికాకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతి ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నాం. ఎన్‌సీడీ కార్యక్రమంలో ప్రజలందరికీ తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నాం.

– అక్షితారెడ్డి, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ అధికారి

ఇలా చేస్తే ప్రయోజనం

- ఒత్తిడి తగ్గించుకుని ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించాలి.
- ఉదయం పూట నడకను అలవర్చుకుంటే ప్రయోజనం.
- భోజనంలో ఉప్పు సాధారణంగా ఉండేలా చూసుకోవాలి.
- రోజూ కనీసం 8 గంటలు నిద్రపోవాలి.
- బరువు పెరగకుండా చూసుకోవాలి.
- రోజూ 3 లీటర్ల మంచినీరు తాగాలి.
- యోగా సాధన, వ్యాయామం చేయాలి.
- సమయానికి ఆహారానికి తీసుకోవాలి.

రహదారుల నిర్మాణంలో రాజీపడం



గరిడేపల్లి : గానుగబండలో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

- నాణ్యతాప్రమాణాలతో రోడ్లు నిర్మించాలి
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- గరిడేపల్లిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

గరిడేపల్లి : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో రహదారుల నిర్మాణంలో రాజీపడే ప్రసక్తే లేదని, అన్ని మండల కేంద్రాలు, గ్రామాల్లో రహదారులు నిర్మిస్తామని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గరిడేపల్లి మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ.17కోట్లతో నిర్మిస్తున్న రహదారుల పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారులు నిర్మాణంలో నాణ్యతాప్రమాణాలు పాటించాలని, నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. రోడ్డు నిర్మాణం జరిగే సమయంలో సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మండలంలోని గానుగబండ నుంచి పరెడ్డిగూడెం వరకు రూ.1.40 కోట్లతో 2 కిలోమీటర్లు, కల్మలచెరువు నుంచి చెవ్వారిగూడెం మీదుగా నేరేడుచర్ల మండలం దిర్శంచర్ల వరకు రూ.3.5కోట్లతో 4.6 కి.మీ, కల్మలచెరువు నుంచి గానుగబండ వరకు రూ.2.8కోట్లతో 6 కి.మీ, కల్మలచెరువు నుంచి పాలకవీడు మండలంలోని సబ్ స్టేషన్ వరకు రూ.4.2కోట్లతో 6 కిలోమీటర్లు, కల్మలచెరువు నుంచి బొత్తలపాలెం వరకు రూ.3.5కోట్లతో 5 కిలోమీటర్లు, కల్మలచెరువు నుంచి సోమ్లాతండా వరకు రూ.84లక్షలతో 1.2 కిలోమీటర్ల దూరంతో రోడ్లు నిర్మిస్తున్నట్లు మంత్రి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి లక్ష్యంగా నిరంతరం పనిచేస్తున్నానని తెలిపారు. అనంతరం గానుగబండలో దుర్గామాత విగ్రహాన్ని దర్శించుకొని పూజలు చేశారు. ప్రజలకు బతుకమ్మ, దసరా శుభాకాంక్షలు తెలిపారు.

నాయకుల తీరుపై మంత్రి అసహనం

గరిడేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకుల తీరుపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అసహనంతోపాటు ఒకింత ఆగ్రహం వ్యక్తం చేశారు. గానుగబండలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకు కనీసం మైక్ సక్రమంగా ఏర్పాటు చేయలేకపోవడం పట్ల సభా ప్రాంగణంలో నాయకులపై అసహనాన్ని వ్యక్తం చేశారు. అక్కడ నుంచి కల్మలచెరువులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అక్కడ మాట్లాడుతూ కూడా గానుగబండలో చేసిన అభివృద్ధి పనులపై వివరిద్దామంటే మైక్ సరిగ్గా పనిచేయలేదని ఇక్కడైనా పనిచేస్తుందా లేదా అని చమత్కరించారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, పంచాయతీరాజ్ ఈఈ వెంకటయ్య, తహసీల్దార్ బండ కవిత, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి, నాయకులు పైడిమర్రి రంగనాథ్, పెండెం శ్రీనివాస్‌గౌడ్, కటికం రమేష్, మూలగుండ్ల సీతారాంరెడ్డి, బచ్చలకూరి మట్టయ్య, గుండు రామాంజిగౌడ్, చామకూరి రజిత, పరమేష్, చాంది మియా, ముత్యాలగౌడ్, సందీప్, సరిత, వెంకటరెడ్డి, యోహాన్, బచ్చలకూరి కృష్ణ, జయరాం నాయక్, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం బీసీలకు అండగా ఉంటుందని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించామని రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్రం వచ్చిన తర్వాత దేశ చరిత్రలో మొదటిసారిగా తెలంగాణ ప్రభుత్వంలో తాను చైర్మన్‌గా ఉన్న కమిటీ 3.70 కోట్ల మందిని ఇంటింటి సర్వే నిర్వహించి బీసీ కులగణన చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 50 శాతం బీసీలు ఉన్నారని, తమ ప్రభుత్వం బీసీలకు విద్యలో, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించేందుకు రాష్ట్ర కేబినెట్‌లో, శాసనసభలో బిల్లును ఆమోదించి చట్టం చేశామని మంత్రి గుర్తుచేశారు.



బూరుగడ్డలో చాకలి ఐలమ్మ విగ్రహం ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్

ఐలమ్మ పోరాటం.. స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్



కలెక్టరేట్‌లో ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట : వీరనారి చాకలి ఐలమ్మ పోరాటం నేటి యువతకు స్ఫూర్తిదాయకం కావాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం సూర్యాపేటలోని కలెక్టరేట్ సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన చాకలి ఐలమ్మ 130వ జయంతి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెనుకబడిన వర్గాలకు న్యాయం జరగాలనే కసితో చాకలి ఐలమ్మ పోరాటం చేశారన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, డీఈఓ అశోక్, డీపీఓ యాదగిరి, బీసీ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి అధికారులు నరసింహ, శ్రీనివాస్, శంకర్, కలెక్టరేట్ ఏఓ సుదర్శన్‌రెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి దున్న శ్యామ్, బీసీ సంఘం నాయకులు పద్మ, సైదులు, సత్యనారాయణపిళ్లై, చల్లమల్ల నరసింహ, సిబ్బంది పాల్గొన్నారు.

గడువులోగా సీఎంఆర్ లక్ష్యం పూర్తిచేయాలి

సూర్యాపేట : సీఎంఆర్ లక్ష్యాన్ని గడువులోగా పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ కె.సీతారామారావు ఆదేశించారు. శుక్రవారం సూర్యాపేటలోని కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో మిల్లర్లు, అధికారులతో సీఎంఆర్‌పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సీఎంఆర్ గడువు నవంబర్ 12 వరకు పెంచిందన్నారు. మిల్లర్లంతా సహకరించి గడువు నాటికి సీఎంఆర్ ఇవ్వాలన్నారు. మిల్లులను ఎప్పటికప్పుడు అధికారులు తనిఖీ చేస్తూ సీఎంఆర్ పూర్తి చేసేలా చూడాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్ఓ మోహన్ బాబు, డీఎం రాము, ఏఎస్ఓ శ్రీనివాసరెడ్డి, మిల్లర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

సూర్యాపేట : త్వరలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆర్‌ఓలు, ఏఆర్‌ఓల శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ఎన్నికల కమిషన్ రూల్స్ ప్రకారం నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె.సీతారామారావు, జెడ్పీ సీఈఓ వీవీ.అప్పారావు, డీపీఓ యాదగిరి, ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

వివరాల నమోదు వేగవంతం చేయాలి

భానుపురి (సూర్యాపేట) : ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన పీఎంఏవైజీ సర్వే యాప్‌లో వివరాల నమోదు వేగవంతం చేయాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లాలోని గృహ నిర్మాణ శాఖ డీఈ, ఏఈలతో వెబ్ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. వివరాలు నమోదుకు ఈనెల 30 చివరి తేదీగా నిర్ణయించామన్నారు. ఇళ్ల నిర్మాణాల విషయంలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ వెబ్ కాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ సిద్ధార్థ, ఇన్‌స్పెక్టర్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

మూసీ ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద వస్తున్నందున రిజర్వాయర్ నిండుకుండలా మారుతుందని, పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూసీ నదికి శనివారం ఉదయం వరకు ప్రవాహం పెరిగే అవకాశం ఉందని, కేతేపల్లి మండలం భీమారంలో లోలెవెల్ కాజ్ వే దాటే ప్రయత్నం చేయవద్దని కోరారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం శ్రీరాజ్యలక్ష్మీచెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహ స్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, బిందెతీర్థం, నిత్యహోమం, మూలవి రాట్‌కు పంచామృతాభిషేకం చేశారు. ఎదుర్కోలు మహోత్సవం అనంతరం నిత్యకల్యాణం నిర్వహించారు. శ్రీస్వామి అమ్మవార్లను గరుడ వాహనంపై ఆలయ తిరుమాడ వీధుల్లో ఊరేగించారు. మహానివేదన గావించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలి

సూర్యాపేటటౌన్ : పోలీసులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఎస్పీ నరసింహ అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న ఫిర్యాదుదారులతో మాట్లాడి పోలీసు సేవలు, సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణాన్ని పరిశీలించి పిటీషన్ మేనేజ్‌మెంట్, రిసెప్షన్ సెంటర్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధితులకు మెరుగైన సేవలు అందిస్తేనే పోలీస్ శాఖపై నమ్మకం పెరుగుతుందన్నారు. సిబ్బంది అందరూ కలిసి టీం వర్క్ చేయాలని సూచించారు. ఆయన వెంట పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, పోలీస్ స్టేషన్ ఎస్ఐలు ఏడుకొండలు, మహేందర నాథ్, శివతేజ, సురేష్, సిబ్బంది ఉన్నారు.



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ నరసింహ

అసైన్డ్ భూముల సాగుకు యత్నం

- నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు
- జేసీబీలతో చదును చేస్తున్న అక్రమార్కులు
- అడ్డుకోవాలంటున్న యడవెల్లి గ్రామస్తులు



సాగుకు యోగ్యంకాని భూమిలో జేసీబీ సహాయంతో చెట్లను తొలగిస్తున్న దృశ్యం

నూతనకల్ : కొందరు అక్రమార్కులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అడ్డదారుల్లో అసైన్డ్ భూముల సాగుకు పూనుకున్నారు. ఈ క్రమంలో సాగుకు యోగ్యంకాని భూములను భారీ యంత్రాలను ఉపయోగించి చదును చేస్తున్నారు. ఈ వ్యవహారం నూతనకల్ మండలంలో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.. నూతనకల్ మండలం యడవెల్లి గ్రామ శివారులో 87 సర్వే నంబర్‌లో దేశ్‌ముఖ్ జెన్నారెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి పేరు మీద పట్టా కలిగిన 18ఎకరాల పైచిలుకు భూమిని గ్రామంలోని గొర్రెల మేతకోసం యాదవులకు శ్యాంసుందర్‌రెడ్డి ఉచితంగా ఇచ్చారు. ఈ భూమి అసైన్డ్ భూమి జాబితాలో చేరింది. ఈ భూమిపై రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారుల కన్నుపడింది. దీంతో గొర్రెలకాపరులకు పెద్ద మొత్తంలో నగదు ఆశ చూపి భూములను కొనుగోలు చేశారు. అయితే అసైన్డ్ భూముల వివరాల నివేదిక అందించాలని ఇటీవల ప్రభుత్వం ఆదేశించడంతో సర్వే నిర్వహిస్తున్నారు.

సాగుకు యోగ్యంగా మార్చేందుకు..

87 సర్వే నంబర్‌లో సాగుకు యోగ్యంకాని భూములను సర్వే చేయబోమని అధికారులు తెల్పడంతో యాదవ కులస్తుల నుంచి భూమిని కొనుగోలు చేసిన వ్యక్తి జేసీబీలను ఏర్పాటు చేసి సాగుకు యోగ్యమైన భూమిగా మార్చడం కోసం పదుల సంఖ్యలో భారీ యంత్రాలను ఉపయోగించి పచ్చని చెట్లు, రాతి బండలను తొలగిస్తున్నాడు. దీంతో అక్కడ నివసించే నెమళ్లు, అడవి పందులు, వివిధ పక్షుల జాతులకు నిలువనీడ లేకుండా పోయింది. అధికారులు స్పందించి సాగుకు యోగ్యంకాని భూమిలో చేపడుతున్న భూ అభివృద్ధి పనులను వెంటనే నిలిపివేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు : తహసీల్దార్

ఈ విషయమై నూతనకల్ తహసీల్దార్ శ్రీనివాసరావును వివరణకోరగా సీలింగ్ యాక్ట్ ప్రకారం సాగుకు యోగ్యంకాని భూములు సర్వేచేయబోమని, సాగు భూములనే సర్వేచేసి నిర్ధారిస్తామని తెలిపారు. అసైన్డ్ భూముల విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

ఆదాయ వనరులు పెంచేలా..

- గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలపై ఆరా
- సర్వేకు ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం
- వివరాల నమోదుకు సమర్థ్ పంచాయతీ యాప్
- సిద్ధమవుతున్న కార్యదర్శులు



నాగారంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం

నాగారం : గ్రామ పంచాయతీల్లో సొంత ఆదాయ వనరులను పెంచాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా సమర్థ్ పంచాయతీ యాప్‌ను తీసుకొచ్చింది. ముందుగా పంచాయతీల్లో మౌలిక సదుపాయాలపై సర్వే చేపట్టాలని నిర్ణయించింది. సర్వే ప్రకారం గ్రామ పంచాయతీల్లో ఆదాయ వనరుల వివరాలను నమోదు చేయనున్నారు. వివరాలను పంచాయతీ కార్యదర్శులు సమగ్రంగా నమోదు చేయాలని గ్రామీణాభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ ఇప్పటికే ఆదేశించింది. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీ కార్యదర్శులు పీఎం ఆవాస్ యోజన కింద ఇందిరమ్మ లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు. దీనితో పాటు గ్రామ పంచాయతీల్లో మౌలిక సదుపాయాలపై సర్వే చేయనున్నారు. పంచాయతీల్లో పాలకవర్గాలు లేక 20 నెలలు గడిచి పోయాయి. త్వరలో ఎన్నికలు నిర్వహించాల్సిన నేపథ్యంలో సర్వే నిర్వహించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రజల అవసరాలను గుర్తించేలా..

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గ్రామజ్యోతి కార్యక్రమంలో మౌలిక వసతుల వివరాలను సేకరించారు. అంచనా వ్యయం రూ.కోట్లలో ఉండడంతో అప్పటి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ముందుకు కొనసాగించలేదు. ఈ నేపథ్యంలో తాజాగా గ్రామాల్లో మౌలిక వసతులపై సర్వే చేయాలని ఆదేశాలు రావడం గమనార్హం. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ సెంటర్లు, పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, గ్రంథాలయాలు, రైతు వేదికలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, పాల సేకరణ కేంద్రాలు, వైకుంఠధామాలు, పల్లె నర్సరీలు, ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, వీధిదీపాలు, కులాయిలు, బోరు బావులు, మోటార్లు, మురుగు కాల్వలు, రోడ్లు, ఇంకుడు గుంతలు, ట్రాక్టర్లు, ట్రాలీల వంటి వివరాలను యాప్‌లో పొందుపరుస్తారు. గ్రామాల్లో ప్రజల అవసరాలను గుర్తించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ సర్వే చేపట్టినట్టు తెలుస్తోంది.

సర్వే నిర్వహించాలని ఆదేశించాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో మౌలిక సదుపాయాలపై సర్వే చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించాం. ఈ సర్వేలో గ్రామాల్లోని వసతులను గుర్తించి యాప్‌లో నమోదు చేస్తారు.

– కె.యాదగిరి, జిల్లా పంచాయతీ అధికారి

సలహాలు.. సూచనలు..

పంచాయతీలను పర్యవేక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం సమర్థ్ వెబ్ పోర్టల్‌ను ప్రారంభించింది. దీనిద్వారా పంచాయతీ పాలనతో పాటు అభివృద్ధికి సంబంధించిన అంశాలను కేంద్రం పర్యవేక్షించనుంది. గ్రామ పంచాయతీలను ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సలహాలు సూచనలు అందించనుంది. డిజిటల్ వేదిక ద్వారా నేరుగా పంచాయతీలను పర్యవేక్షించడంతో పాటు మరింత బలోపేతం చేసేందుకు పంచాయతీరాజ్ నిపుణులతో అధ్యయన కమిటీని నియమించింది. సొంత ఆదాయ వనరులు పెరుగుదలకు ఆచరణీయమైన నమూనాను రూపొందించనుంది. దీనితోపాటు కేంద్రం కేటాయిస్తున్న నిధులు నేరుగా గ్రామ పంచాయతీలకు చేరేలా పర్యవేక్షించనుంది. జిల్లాలో 486 గ్రామ పంచాయతీలున్నాయి. రానున్న కాలంలో ఇవి మరింత బలోపేతమయ్యే అవకాశం ఉంది.

క్లుప్తంగా

ఉత్తమ పర్యాటక క్షేత్రంగా యాదగిరిగుట్ట



యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం టూరిజం ఎక్సలెన్స్ అవార్డుకు ఎంపికైనట్లు ఆలయ అధికారులు శుక్రవారం రాత్రి వెల్లడించారు. అవార్డును శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అందజేయనున్నారు. యాదగిరి క్షేత్రానికి అవార్డు రావడం ఆనందంగా ఉందని ఇన్‌చార్జి ఈవో గగులోతు రవినాయక్ పేర్కొన్నారు.

ఊంజల్ సేవోత్సవం



హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం నిర్వహించారు. సాయంత్రం సమయంలో అమ్మవారిని బంగారు ఆభరణాలు, వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఆలయంలో ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో స్వాగతం పలికారు. అమ్మవారిని మండపంలో అధిష్టించి ఊంజల్ సేవోత్సవం జరిపించారు. ఇక ఆలయంలో నిత్య పూజలు యధావిధిగా కొనసాగాయి.

యాదాద్రీశుడి సన్నిధిలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఆయన కుటుంబ సభ్యులు శుక్రవారం దర్శించుకున్నారు. స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులకు ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు సంప్రదాయంగా స్వాగతం పలికారు. అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.



ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, కుటుంబ సభ్యులకు ఆశీర్వచనం చేస్తున్న అర్చకులు

• బంగారు కనకదుర్గమ్మ



చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని రామాలయం వద్ద ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారిని శుక్రవారం మహాలక్ష్మీదేవిగా అలకరించారు. సుమారు అర కేజీకి పైగా బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలకరించారు.

• రూ.18,50,116 కరెన్సీతో అలంకరణ

మఠంపల్లి: మండలంలోని హనుమంతులగూడెంలో కనకదుర్గా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని రూ.18,50,116ల కరెన్సీ నోట్లతో అలంకరించారు.



రేషన్ బియ్యం పట్టివేత

డిండి: అక్రమంగా నిల్వ ఉంచిన 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ సిబ్బంది, పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. డిండి మండలం ఎర్రారం గ్రామ సమీపంలోని రైస్ మిల్లులో ఎలాంటి అనుమతులు లేకుండా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని నిల్వ ఉంచారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ బాలకృష్ణ, ఆర్ఐ నర్సింహ అక్కడకు చేరుకుని బియ్యాన్ని సీజ్ చేసి దేవరకొండ డీటీ సీఎస్ గోదాంకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మధురం.. సీతాఫలం

- రుచితోపాటు ఆరోగ్యానికి మేలు
- ప్రారంభమైన పండ్ల విక్రయాలు



రాజాపేట : సీతాఫలాలంటే ఇష్టపడని వారుండరు. సెప్టెంబర్ చివరివారం నుంచి మొదలుకుని నవంబర్ వరకూ ఈ ఫలాలు విరివిగా లభిస్తాయి. కురిసిన వర్షాలను బట్టి సీతాఫలాలు లభిస్తుంటాయి. సీతాఫలాలు ఎంతో ఆరోగ్యకరం. చిన్నా, పెద్దా తేడాలేకుండా ఎంతో ఇష్టంగా తింటుంటారు. వీటిలో గ్లూకోజ్, విటమిన్ సీ, ఏ, బీ6, పొటాషియం, మెగ్నీషియం, ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు, పిండిపదార్థాలు మెండుగా ఉంటాయి. పోషక విలువలతో కూడిన సీతాఫలాలు తీసుకుంటే శరీరం ఎంతో ఆరోగ్యకరంగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. ఇవి తేలికగా జీర్ణం కావడంతోపాటు పోషక పదార్థాలు సమృద్ధిగా అందుతాయని పేర్కొంటున్నారు.

రైతు కూలీలకు జీవనోపాధి

సీతాఫలాలు అక్టోబర్, నవంబర్ మాసాల్లో ఎక్కువగా లభిస్తుంటాయి. ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే విరివిగా వచ్చేసాయి. ఈ సీతాఫలాలతో కొందరు రైతుకూలీలు జీవనోపాధి పొందుతారు. రాజాపేట మండలంలోని సింగారం, పుట్టగూడెం, కొండేటిచెర్వు, మల్లగూడెం, చల్లూరు, నర్సాపురం, బొందుగుల తదితర గ్రామాల్లో ఎక్కువగా సీతాఫలాలు లభిస్తుంటాయి. కూలీలు తమ వ్యవసాయ పొలాల వద్ద ఫలాలను సేకరించే పనిలో ఉంటారు. ఒక్క బాక్స్‌ను రూ.300 వరకు విక్రయిస్తున్నారు. ఇలా సేకరించిన సీతాఫలాలు హైదరాబాద్, సికింద్రాబాద్, నిజామాబాద్, సిద్దిపేట వంటి ప్రదేశాలకు ఎగుమతి చేస్తారు. వ్యాపారులు మాత్రం పట్టణాల్లో రూ.700 నుంచి రూ. 1000 వరకు విక్రయిస్తుంటారు.



విక్రయానికి సిద్ధంగా ఉంచిన సీతాఫలాలు



సీతాఫలాలను వాహనంలో తరలిస్తున్న రైతులు

చెట్టుచెట్టుకు తిరిగి సేకరిస్తాం



సీతాఫలాలు రెండు నెలలపాటు లభిస్తాయి. చెట్టుచెట్టుకు తిరిగి పండ్లు సేకరిస్తాం. వీటిని రోజుకు రూ. 200 నుంచి రూ. 300 వరకు వస్తాయి. వ్యాపారులు మా దగ్గర సీతాఫలాలను తక్కువ ధరకు హైదరాబాద్, సికింద్రాబాద్‌కు తీసుకెళ్లి అధిక ధరలకు విక్రయించి సొమ్ముచేసుకుంటారు.

– కర్రె లక్ష్మి, రాజాపేట మహిళా కూలీ

మహిళల ఆరోగ్య శ్రేయస్సుకు ప్రధాని మోదీ కృషి

- ఎంపీ డీకే అరుణ

బీబీనగర్: మహిళల ఆరోగ్య శ్రేయస్సుకు ప్రధాని మోదీ కృషి చేస్తున్నారని, అందులో భాగంగానే స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్‌ను ప్రవేశపెట్టారని ఎంపీ, ఎయిమ్స్ బోర్డు మెంబర్ డీకే అరుణ అన్నారు. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా బీబీనగర్ ఎయిమ్స్ వైద్య కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా బ్రెస్ట్ క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షా కేంద్రాన్ని ప్రారంభించారు. ఎయిమ్స్‌లో అందుతున్న వైద్య సేవలు, వసతుల పట్ల రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంత శాంతసింగ్, డిప్యూటీ డైరెక్టర్ బిపిన్ వర్గీస్‌తో సమావేశమై స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా కొనసాగుతున్న క్యాంప్‌లు, కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు, ఆమె మాట్లాడుతూ.. స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్‌లో భాగంగా మహిళలకు మెడికల్ క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు, ఉచితంగా అనేక రకాల టెస్టులు చేస్తున్నట్లు తెలిపారు. ఎయిమ్స్‌లో సెప్టెంబర్ 17వ తేదీ నుంచి 9,400మంది మహిళలు టెస్టులు చేయించుకున్నారని పేర్కొన్నారు. నిరుపేదలందరికీ మెరుగైన వైద్యం అందించడమే ఎయిమ్స్ లక్ష్యమని, ఆదిశగా ఎయిమ్స్‌ను అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆమె వెంట బీజేపీ నాయకులు వేముల అశోక్, జగన్మోహన్‌రెడ్డి, అశోక్‌గౌడ్, నరోత్తమరెడ్డి, గోపాల్‌రెడ్డి, రవీందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న ఎంపీ డీకే అరుణ

పరిమితికి మించి ఆటోలో ప్రయాణం

- ఆటోడ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ : పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వస్తున్న ఆటోను ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆపి డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. చౌటుప్పల్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొనేందుకుగాను శుక్రవారం మునుగోడు క్యాంప్ కార్యాలయం నుంచి ఎమ్మెల్యే తన కాన్వాయ్‌తో వస్తున్నారు. అదే సమయంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామ శివారులో నారాయణపురం నుంచి ప్రయాణికులతో వస్తున్న ఆటోను చూసి తన కాన్వాయ్‌ను ఆపి ఆటో వద్దకు చేరుకున్నారు. చంటి బిడ్డలతో వెనుక డోర్‌పై ప్రమాదకరంగా ఎందుకు కూర్చుంటున్నారని అడిగారు. ప్రయాణికులను ఆటోలో పరిమితికి మించి ఎందుకు ఎక్కించుకున్నావని డ్రైవర్‌ను ప్రశ్నించారు. ఆటో సడెన్‌గా బ్రేక్ వేస్తే వెనుక భాగంలో కూర్చున్న ప్రయాణికులు కింద పడిపోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఇలా పునరావృతం కాకుండా చూసుకోవాలని మందలించారు.



ప్రయాణికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్ మార్చగలిగే శక్తి

- తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య

కోదాడరూరల్ : దేశ భవిష్యత్‌ను మార్చగలిగే శక్తి యువత చేతిలోనే ఉందని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు అంబటి నాగయ్య అన్నారు. శుక్రవారం కోదాడ పట్టణంలోని లాల్ బంగ్లాలో నిర్వహించిన పీవైఎల్ రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతుల ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో జరగుతున్న మతోన్మాద రాజకీయాలను యువత తిప్పికొట్టాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అమెరికన్ సామ్రాజ్యవాదం పేద దేశాలపై ఆధిపత్యం చెలాయిస్తోందని అలాంటి దేశానికి మోదీ ప్రభుత్వం స్వాగతం పలకడం సిగ్గుచేటన్నారు. న్యూడెమోక్రసీ రాష్ట్రనాయకుడు గొని ఐలయ్య మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తానని చెప్పి ఇవ్వకుండా నిరుద్యోగులను, యువతను మోసం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో నిరుద్యోగ భృతి, ప్రతి ఏడాది ఉద్యోగ క్యాలెండర్ ప్రకటిస్తానని హామీ ఇచ్చి అమలు చేయడం లేదని విమర్శించారు. సమావేశంలో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్‌కుమార్, పీవైఎల్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మోకాళ్ల రమేష్, కోలా లక్ష్మీనారాయణ, ప్రజా చైతన్య వేదిక నాయకులు రాయపూడి చిన్ని, ఉపాధ్యక్షులు వనమాల సత్యం, రమేష్, బేజాడి రవికుమార్, రవి, సిద్దేశ్వర్, ధరావత్ రవి, నల్గొండ నాగయ్య, బండి రవి, మోతీలాల్, బీవీ చారి, సిద్దులు, ఉమాశంకర్, మనోహర్, నరసింహారావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అంబటి నాగయ్య

చోరీ కేసులో రెండు నెలల జైలు

నిడమనూరు : బైక్ చోరీ కేసులో వ్యక్తికి రెండు నెలల జైలు, రూ.1000 జరిమాన విధిస్తూ నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి తీర్పు వెల్లడించారు. మేడ్చల్ జిల్లా బోయనపల్లికి చెందిన గన్నెరు రాజశేఖర్ సొంత పనిపై 2024లో జనవరి 10న హాలియాకు వచ్చి, బస్టాండ్ వద్ద తన బైక్ ఉంచాడు. గంటసేపటి తర్వాత రాగా బైక్ కనిపించక పోవడంతో హాలియా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ శోభన్‌బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేయగా పెద్దవూర మండలం, కుంకుడుచెట్టు తండాకు చెందిన రమావత్ రవి దొంగతనానికి పాల్పడ్డట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. వాదనల అనంతరం నేరం రుజువు కావడంతో దొంగతనానికి పాల్పడ్డ రవికి నిడమనూరు జూనియర్ సివిల్ జడ్జి స్వప్న రెండు నెలల జైలు శిక్ష, రూ.1000ల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు.

సాగర్ వద్ద హైవేపై విరిగిపడిన కొండ చరియలు

నాగార్జునసాగర్: శిరోంచ–రేణిగుంట హైవే, నాగార్జునసాగర్ కొత్త బ్రిడ్జి దారిలో కొండ చరియలు విరిగి రోడ్డుపై పడ్డాయి. బండరాళ్లు రోడ్డువెంట గల డ్రైన్ రిటైనింగ్ సైడ్‌వాల్‌కు తగలడంతో పాక్షికంగా దెబ్బతిన్నది. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వర్షం రావడంతో కొండప్రాంతమంతా నానింది. మట్టి కరిగి బండరాళ్లు రోడ్డుపైకి వచ్చాయి. ఆ సమయంలో వాహనాల రాకపోకలు లేకపోవడంతో ఎలాంటి నష్టం వాటిల్లలేదు. పోలీసులు బండరాళ్లను ఎత్తి సైడ్ డ్రైన్‌లోకి దొర్లించారు.



విరిగిపడిన కొండ చరియలు

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- బాలుడు మృతి, ముగ్గురికి గాయాలు

భువనగిరి, మోత్కూరు : కారు అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా.. ముగ్గురికి గాయాలైన సంఘటన శుక్రవారం భువనగిరి మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపల్ పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన చేకూరి మల్లేషం భార్య విజయ, వారి కుమారుడు నిఖిల్, మల్లేషం అన్న కుమార్తె స్నేహతోపాటు, ఆమె నాలుగేళ్ల కుమారుడు అభిరామ్ నలుగురు కలిసి కారులో హైదరాబాద్‌లోని మేడిపల్లి నుంచి దసరా పండుగ నిమిత్తం ఆరెగూడెం వస్తున్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో భువనగిరి మండలం చందుపట్ల గ్రామ సమీపంలోకి రాగానే నిఖిల్ కారును అతి వేగంగా నడపడం, వర్షం వస్తుండడంతో కారు అదుపుతప్పి పక్కనే ఉన్న చెట్టును ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న అభిరామ్ తలకు తీవ్రగాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు. కాగా.. అభిరామ్ తండ్రి ప్రేమ్‌కుమార్ హైదరాబాద్‌లో ఎస్ఐగా పని చేస్తున్నాడు.

హత్య కేసులో ఇద్దరికి జీవిత ఖైదు

- వీరిలో ఒకరు రౌడీషీటర్

రామగిరి(నల్లగొండ): హత్య కేసులో నల్లగొండకు చెందిన ఇద్దరికి జీవిత ఖైదు విధిస్తూ నల్లగొండ ఫ్యామిలీ కోర్టు జడ్జి దుర్గా ప్రసాద్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండకు చెందిన అనుముల వంశీకృష్ణ 2014 ఏప్రిల్ 25న తన స్నేహితులతో కలిసి గ్రీన్‌హిల్స్ కాలనీలో ఉన్నాడు. అక్కడకు వచ్చిన నలపరాజు రాజేష్, పెరిక సాయితేజతో వంశీకృష్ణకు గొడవ జరిగింది. దీంతో వంశీపై రాజేష్ కోపం పెంచుకున్నాడు. అదే రోజు సాయంత్రం వంశీకృష్ణ శివాజీనగర్‌లో ఉన్నాడని తెలుసుకున్న రాజేష్, అతని స్నేహితుడు పెరిక సాయి ఇద్దరూ కలిసి అక్కడికి వెళ్లారు. స్నేహితులతో కలిసి ఉన్న వంశీకృష్ణపై కత్తితో రాజేష్, సాయిలు విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేశారు. ఈ ఘనపై వంశీకృష్ణ తండ్రి అనుముల రమేష్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై క్రాంతికుమార్ కేసు నమోదు చేశారు. సీఐలు రవీందర్, మనోహర్‌రెడ్డి, రవీందర్ విచారణ చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. మృతుడు వంశీ ఇచ్చిన మరణ వాంగ్మూలంతో పాటు, స్నేహితుల సాక్ష్యాలను పబ్లిక్ ప్రాసిక్యూటర్ జవహర్‌లాల్ కోర్టుకు సమర్పించారు. అతని వాదనలతో ఏకీభవించిన జడ్జి.. నిందితులైన రాజేష్, సాయితేజలకు జీవిత ఖైదు, రూ.10వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. కాగా.. రాజేష్ ఇప్పటికే 18 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. అతడిపై రౌడీషీట్ కూడా ఉంది. లైజన్ ఆఫీసర్లు, నరేందర్, మల్లిఖార్జున్, కోర్టు కానిస్టేబుల్ సుమన్ కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించడంలో సహకరించారు.

ఒక వ్యక్తికి రెండు జీవిత ఖైదులు

రామగిరి(నల్లగొండ): బాలికపై అత్యాచారానికి పాల్పడి ఆమె మృతికి కారణమైన వ్యక్తికి రెండు జీవిత ఖైదులు విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి ఎన్. రోజారమణి శుక్రవారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన కట్టెల సైదులు చిట్యాల మండలానికి చెందిన బాలికను బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. అవమానం భరించలేక బాధిత బాలిక కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యకు చేసుకుంది. బాలిక తల్లిదండ్రులు 2019 జూన్ 13న చిట్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలతో ఏకీభవించిన నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి 5 సెక్షన్‌ల కింద రెండు జీవిత ఖైదులు, 3 సంవత్సరాల జైలు శిక్ష, రూ.65వేల జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు వెల్లడించారు. లైజన్ ఆఫీసర్లు నరేందర్, మల్లిఖార్జున్ కోర్టుకు సరైన ఆధారాలు సమర్పించడంలో సహకరించారు.

కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శనీయం



డాక్యుమెంటరీ చిత్రం సీడీని ఆవిష్కరిస్తున్న సుద్దాల అశోక్‌తేజ, మసన చెన్నప్ప

చౌటుప్పల్ : స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ మంత్రి ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవితం ఆదర్శప్రాయంగా నిలుస్తుందని ప్రముఖ సినీ గేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ అన్నారు. చౌటుప్పల్‌కు చెందిన నిర్మాత చిరందాసు ధనుంజయ్య, పోచంపల్లికి చెందిన దర్శకుడు బడుగు విజయ్‌కుమార్‌లు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జీవిత చరిత్ర ఆధారంగా నిర్మించిన యూనిటీ, ద మ్యాన్ ఆఫ్ సోషల్ జస్టిస్ పేరిట నిర్మించిన డాక్యుమెంటరీ చిత్రాన్ని శుక్రవారం ప్రముఖ రచయిత మసన చెన్నప్పతో కలిసి హైదరాబాద్‌లో విడుదల చేశారు. శనివారం జరగనున్న బాపూజీ జయంతికి డాక్యుమెంటరీని అంకితం ఇస్తున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది.

చెరువులో గుర్తుతెలియని రెండు మృతదేహాలు లభ్యం

భువనగిరి: మండలంలోని రాయగిరి పెద్ద చెరువులో శుక్రవారం గుర్తు తెలియని రెండు మృతదేహాలు లభ్యమయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయగిరి చెరువు వద్ద బతుకమ్మ సంబురాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సమయంలో చెరువులో రెండు మృతదేహాలను గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడకు చేరుకుని మృతదేహాలను బయటకు తీశారు. ఇందులో ఒకరు పురుషుడు, మరొకరిది మహిళ మృతదేహంగా గుర్తించారు. నాలుగైదు రోజుల క్రితం చెరువులో దూకినట్లు అంచనా వేస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అనిల్‌కుమార్ తెలిపారు.

ఉపాధినిస్తున్న బతుకమ్మ

- బతుకమ్మ పూల కోసం బంతి, పట్టుకుచ్చుల పూల సేద్యం
- ముత్యాలపూలకు రంగులద్ది మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్న జానమ్మ

రాజాపేట : ఆడపడుచులకు బతుకమ్మ అత్యంత ఇష్టమైన పండుగ. వీటిని పేర్చడానికి తంగేడు, గునుగు, ముత్యాల పువ్వు, పట్టుకుచ్చులు, బంతి, చామంతి, రుద్రాక్ష, గుమ్మడి, టేకు వంటి పూలను ప్రధానంగా వాడుతారు. కానీ ప్రస్తుతం ప్రతి ఒక్కరూ కాలంతోపాటు పరుగెడుతున్నారు. ఎవ్వరికీ తీరికలేకపోవడంతో బతుకమ్మకు కావాల్సిన పూలను సేకరించేందుకు సమయాన్ని వెచ్చించడం లేదు. అయితే కొంతమంది మహిళలు మారుతున్న కాలానికి అనుగుణంగా పూలను సేకరించి వాటికి రంగులద్ది మార్కెట్‌లో విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. అంతేకాకుండా ప్రత్యేకంగా బతుకమ్మ పండుగ సీజన్‌లో బంతి, పట్టుకుచ్చుల పూలు, ముత్యాల పువ్వు వంటి పంటలు సేద్యం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారు. రాజాపేట మండల కేంద్రానికి చెందిన గొల్లెన జానమ్మ 5 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని కొంత భూమిలో వరిసేద్యం చేయడమే కాకుండా అర ఎకరంలో బంతి, అర ఎకరంలో పట్టుకుచ్చుల పూలు సేద్యం చేస్తోంది. రైతుల పొలాల్లో దొరికే ముత్యాల పువ్వు కొనుగోలు చేసి వాటికి రంగులద్ది విక్రయిస్తూ జీవనోపాధి పొందుతోంది. బంతి, పట్టుకుచ్చులు, ముత్యాల పువ్వు రూ. 100కు నాలుగు కట్టల చొప్పున విక్రయిస్తోంది.



జానమ్మ సాగు చేస్తున్న బంతి, సీతజడ పూల తోట



ముత్యాలపువ్వుకు రంగులద్ది కట్టలు కడుతున్న జానమ్మ

పూలకు రంగులద్ది విక్రయిస్తాను

ప్రస్తుతం చాలా మందికి బతుకమ్మ కోసం పూలు సేకరించేందుకు బయటకు వెళ్లే తీరిక లేకుండా పోయింది. అందుకే నేను ప్రతి ఏటా బతుకమ్మ పండుగ సందర్భంగా తీరొక్క పూలు సేకరించి వాటికి రంగులద్ది విక్రయిస్తున్నా. రూ. 100కు నాలుగు కట్టల చొప్పున ఇస్తాను. బంతి, పట్టుకుచ్చుల పూల పంట సేద్యం చేశాను.

– జానమ్మ, మహిళా కూలీ, రాజాపేట

అటవీ భూములు పరిశీలించిన అదనపు చీఫ్ కన్జర్వేటర్

మర్రిగూడ: మండలంలోని శివన్నగూడెం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా కోల్పోయిన ఫారెస్ట్ భూములను రాష్ట్ర అదనపు చీఫ్ కన్జర్వేటర్ ప్రవీణ శుక్రవారం సందర్శించారు. అటవీ భూముల విస్తీర్ణాన్ని పర్యవేక్షించి వివరాలు సేకరించారు. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా అటవీ భూముల వివరాలను సేకరించేందుకు సంబంధిత అధికారుల నుంచి పూర్తి వివరాలు ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. ఆమె వెంట మర్రిగూడ ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ డి.అఖిలేష్‌గౌడ్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ లావణ్య, రాములు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఉదయ్ ఉన్నారు.

లాడ్జీల్లో పోలీసుల తనిఖీలు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట పట్టణంలోని పలు లాడ్జీలను ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, పట్టణ సీఐ భాస్కర్ ఆదేశాల మేరకు ఎస్సైలు యాదయ్య, సైదులు ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. శ్రీలక్ష్మీనివాస్ ఫ్యామిలీ లాడ్జి, మణికంఠ లాడ్జిల్లో నిబంధనలు పాటించకపోవడంతో వాటి యజమానులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ భాస్కర్ తెలిపారు.

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు గ్రామానికి చెందిన ఎక్సైజ్ డీఎస్పీ బిక్కి గుర్వయ్యగౌడ్ శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేదలైన ఇరుగు రమేష్, పోలెపాక శ్రీనివాస్‌లకు ప్రభుత్వం అందించిన సహాయ సహకారాలతో పాటు తన వంతుగా ఒక్కొక్కరికి రూ. 6వేల చొప్పున అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు పులుసు సత్యం, కందాల శంకర్‌రెడ్డి, బొజ్జ శ్రీనివాస్, తొట్ల లింగయ్య, బత్తుల తిరుమలేష్, తొట్ల హరీష్, తొట్ల ఎల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలికి నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

మద్దిరాల : సీపీఎం నాయకురాలు బద్దం పూలమ్మ సేవలు మరువలేనివని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. శుక్రవారం గోరెంట్లలో నిర్వహించిన బద్దం పూలమ్మ ప్రథమ వర్ధంతి సభలో ఆయన పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో సీపీఎం నిర్మాణం కోసం కృషి చేసిన వారిలో బద్దం సోమిరెడ్డి ముఖ్యుడని అన్నారు. ఆయన భార్యగా పూలమ్మ కూడా పార్టీకి ఎంతో సేవ చేసిందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు కందాల శంకర్‌రెడ్డి, బుర్ర శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి పోలోజు సైదులు, పోలమ్మ, బద్దం వెంకట్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, దీకొండ ఉపేందర్ పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవా

తుంగతుర్తి : తుంగతుర్తి మండల పరిధిలోని జెడ్పీహెచ్ఎస్ బండరామారం పాఠశాలలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ నాగ వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. అలాగే కెనరా బ్యాంక్ పరిసరాలను శుభ్రం చేశారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు, రామకృష్ణ, అఫ్రీన్, నరేష్, పంచాయతీ కార్యదర్శి రజిత, కెనరా బ్యాంక్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాగారం ఎస్‌ఐగా యాకూబ్



నాగారం : నాగారం మండల నూతన ఎస్‌ఐగా ఎస్‌కె.యాకూబ్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నాగారం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఐలయ్య సూర్యాపేట వీఆర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో సూర్యాపేట డీసీఆర్‌బీలో పనిచేస్తున్న యాకూబ్ నాగారం ఎస్‌ఐగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. అనంతరం నూతన ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టిన యాకూబ్‌కు నాగారం పోలీస్‌స్టేషన్ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

పారదర్శకంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవ్‌రావు

నూతనకల్ : గ్రామాల్లో భూముల సర్వేను సంబంధిత అధికారులు పారదర్శకంగా నిర్వహించాలని సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో ప్రభుత్వం నిర్దేశించిన సర్వే నంబర్ల ఆధారంగా అధికారులు సర్వే నిర్వహించాలని ఆయన సూచించారు. సర్వే అనంతరం నివేదికలు అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు, గ్రామపాలన అధికారులు, సర్వే అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల పనులు ప్రారంభం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని అడివెంల గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్లకు శుక్రవారం ముగ్గు పోసే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో హౌజింగ్ మండల ఏఈ పూజ, కార్యదర్శి మహాలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు ఎడ్ల సైదులు, పిట్టల సైదులు, జాని, అంజయ్య, సైదులు, విద్యాసాగర్, రవి, లింగయ్య, వెంకన్న, రమేష్, గణేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరనారి చాకలి ఐలమ్మకు నివాళి



సూర్యాపేట టౌన్ : చాకలి ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ



తిరుమలగిరిలో నివాళులర్పిస్తున్న నాయకులు

సూర్యాపేటటౌన్: వీర వనిత చాకలి ఐలమ్మ జయంతిని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్ర పటానికి ఎస్పీ నరసింహ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ జనార్దన్ రెడ్డి, డీసీఆర్‌బీ డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు పాల్గొన్నారు.

సూర్యాపేట అర్బన్ : భూమికోసం, భుక్తికోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన ధీర వనిత చాకలి ఐలమ్మ అని మున్సిపల్ డీఈ సత్యారావు అన్నారు. శుక్రవారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, ఆర్‌ఓ కళ్యాణి, సీనియర్ అసిస్టెంట్లు జాన్ పాటి నాగయ్య, సంగు మాధవి, జేఏఓ సంగీత మాధురి, టీఓ రాజు రెడ్డి, ఎండీ గౌసుద్దీన్, ఎస్ఏ స్‌ఆర్ ప్రసాద్, మనోజ్, యాదగిరి పాల్గొన్నారు.

తిరుమలగిరి : చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను మండల రజక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రజక సంఘం అధ్యక్షుడు పులిమామిడి సోమయ్య, సోమనర్సయ్య, వెంకన్న, నర్సయ్య, మల్లయ్య, రమేష్, భిక్షం, కృష్ణ, బలరామ్, మహేష్, కాంగ్రెస్



అర్వపల్లి : కొమ్మాలలో ఐలమ్మ విగ్రహానికి నివాళులర్పిస్తున్న రజక సంఘం నాయకులు

మండల అధ్యక్షుడు వై.నరేష్, మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్, కొత్తగట్టు మల్లయ్య, శోభారాణి, దామెర శ్రీనివాస్, కందుకూరి సోమయ్య, చేను శ్రీనివాస్, రాంప్రభు, యాదగిరి పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలలో..

చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను తిరుమలగిరి మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాలలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మున్వర్‌అలీ, తహసీల్దార్ హరిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : మండలంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి జాజిరెడ్డిగూడెంలో ఎస్ఐ ఈట సైదులు, తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, కొమ్మాలలో రజక సంఘం నాయకులు బాసాని లక్ష్మయ్య, రాములు, ఉప్పలయ్య, జలేందర్ నివాళులర్పించారు.

మద్దిరాల : వీరనారి, తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అయేషా ఫర్వీన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ జానయ్య అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ రాజేశ్వర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



సూర్యాపేట అర్బన్ : మున్సిపల్ కార్యాలయంలో..



తిరుమలగిరి : మున్సిపల్ కార్యాలయంలో..



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో..



పెన్‌పహాడ్ : ఎంపీడీఓ కార్యాలయంలో..



తిరుమలగిరి : తహసీల్దార్ కార్యాలయంలో..



అర్వపల్లి : తహసీల్దార్ కార్యాలయంలో..

తల్లిదండ్రులు క్రమశిక్షణ నేర్పించాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య

సూర్యాపేటటౌన్ : అధ్యాపకులు పాఠాలు బోధిస్తే తల్లిదండ్రులు తమవంతు బాధ్యతగా పిల్లలకు మంచి చెడులు బోధించి క్రమశిక్షణ నేర్పించాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పెరుమాళ్ల యాదయ్య అన్నారు. ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ దశలోనే విద్యార్థులకు మంచి చెడులపై అవగాహన ఉండేలా తీర్చిదిద్దాలన్నారు. పేరెంట్స్, టీచర్స్ ఇరువురి సమష్టి కృషితోనే విద్యార్థుల భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. ఈ దశలో విద్యార్థులు పక్కదారి పడితే భవిష్యత్తు శూన్యమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వీడీఎస్ ప్రసాద్, వాసు, బేగం, సైదులు, గురవయ్య, చిరంజీవి, లలిత, రమేష్, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

మా తండాను పట్టించుకోండి సారూ..



కాలిపోయిన మోటార్ వద్ద గ్రామస్తుడు



ప్రమాదకరంగా ఉన్న రోడ్డు

- వర్షానికి తెగిన అస్లంతండా రోడ్డు
- 45 రోజులుగా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గిరిజనులు
- తాగునీటి బోరు మోటారు కాలిపోయినా పట్టించుకునేవారు కరువు

ఆత్మకూరు (ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని బొప్పారం శివారు అస్లంతండా గిరిజనుల కష్టాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. 35 కుటుంబాలున్న ఆ తండాకు కనీసం రోడ్డు కూడా సరిగాలేదు. పైగా ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు తెగిపోయి గిరిజనులు మరింతగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి సరిగా లేక 45 రోజులుగా రాకపోకలకు అవస్థలు పడుతున్నా తమ కష్టాలు ఎవరూ పట్టించుకోవడంలేదని గిరిజనులు ఆరోపిస్తున్నారు.

తాగునీటికీ ఇబ్బందులే..

అస్లంతండా గిరిజనులకు తాగునీటిని అందించే బోరు మోటారు గత 15 రోజుల క్రితం కాలిపోయింది. ఆరోజు నుంచి తండావాసులు నీటి కోసం నానా ఇబ్బందులు పడుతున్నారు. 15 రోజు లుగా తాగునీటి కోసం రెండు కిలోమీటర్ల దూరంలోని ఏపూర్ తండాకు వెళ్లాల్సి వస్తోందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ కార్యదర్శికి సమస్యను ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేయగా స్పందించలేదు. సమస్యలను పరిష్కరించాలని గిరిజనులు కోరుతున్నారు.

30న సహపంక్తి భోజనాలు

ఆత్మకూర్ (ఎస్) : మహాత్మా జ్యోతిబా పూలే సత్యశోధక సమాజ్‌ను స్థాపించి 150 ఏళ్లు అవుతున్న సందర్భంగా ఈ నెల 30న బొప్పారంలో కుల నిర్మూలన సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తున్నట్లు అరుణోదయ రాష్ట్ర నాయకుడు ఎర్ర ఉమేష్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని బొప్పారంలో కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో దళితులపై దాడులు, అణచివేత, అంటరానితనం వివక్ష ఇంకా కొనసాగుతున్నాయని తెలిపారు. అంబేద్కర్ రూపొందించిన రిజర్వేషన్లు లేకుండా చేసేందుకు తీవ్ర ప్రయత్నాలు కొనసాగుతున్నాయని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు మతోన్మాద హిందుత్వ రాజకీయాలు చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సోమిరెడ్డి ఉపేందర్ రెడ్డి, ఎర్ర గణేష్, రాంబాబు, పరశురాం, నరసయ్య, లింగయ్య, గుండెబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేయాలి

సూర్యాపేటటౌన్ : విద్యార్థినులను ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే ధైర్యంగా షీటీమ్‌కు ఫిర్యాదు చేయాలని షీటీమ్ ఎస్ఐ నీలిమ అన్నారు. జిల్లా పోలీస్ షీ టీమ్ ఆధ్వర్యంలో సూర్యాపేట పట్టణంలోని జయ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లా పోలీస్ శాఖ షీ టీమ్స్ ఆధ్వర్యంలో మహిళల భద్రతకు మరింత రక్షణ కల్పిస్తుందని తెలిపారు. విద్యార్థినులు ఒకరి పట్ల ఒకరు సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే సూర్యాపేట షీ టీమ్ ఫోన్ నంబర్ 8712686056కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. వ్యక్తిగత సమాచారం, బ్యాంకు వివరాలు, ఏటీఎం పిన్ నంబర్లు ఎవరికి చెప్పవద్దని అన్నారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలను డీపీలుగా పెట్టుకోవద్దని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, విద్యార్థులు, షీ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

యువత భాగస్వామ్యం కావాలి

ఆత్మకూర్ (ఎస్) : యువత దేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని ఆర్‌ఎస్‌ఎస్ నల్లగొండ విభాగ్ ప్రచారక్ కాచం సత్యనారాయణ అన్నారు. శుక్రవారం నెమ్మికల్ గ్రామంలో నిర్వహించిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ సేవలో ఆర్‌ఎస్‌ఎస్ ఎప్పుడూ ముందుంటుందని తెలిపారు. యువత ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి దేశం కోసం, ధర్మం కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ సుందర్, పగిడోజు పరిపూర్ణాచారి, కుంచం అశోక్, మనోహర్, శివాజీ, స్వయంసేవకులు, హిందుత్వ అభిమానులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా యాత్ర



అర్వపల్లిలో అవగాహన కల్పిస్తున్న ప్రభాకర్

అర్వపల్లి : డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా బైక్ యాత్రను చేపట్టినట్లు మద్దిరాల మండలం గోరెంట్ల జెడ్పీహెచ్ఎస్ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త రాచకొండ ప్రభాకర్ చెప్పారు. యాత్రలో భాగంగా శుక్రవారం అర్వపల్లికి వచ్చిన సందర్భంగా డ్రగ్స్, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రజలకు అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల బారిన పడి యువకులు ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్న ఉద్దేశంతో రాష్ట్ర వ్యాప్తంగా బైక్ యాత్రను చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే వివిధ జిల్లాలలో 1000 కిలోమీటర్ల బైక్ యాత్ర చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో బైరబోయిన రామలింగయ్య, రాగి అనిల్, పొన్నం శ్రీనివాస్, రాగి మహేష్, నాగరాజు, బైరబోయిన సంతు, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ అప్పారావు

మద్దిరాల : మద్దిరాల మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలో మొత్తం 522 ఉపాధిహామీ పనులు జరగగా రూ.5,85,30,499 నిధులు మంజూరైనట్లు డీఆర్‌డీఓ అప్పారావు తెలిపారు. అదే విధంగా పంచాయతీరాజ్ ద్వారా 44 పనులు మంజూరు కాగా ఆ పనులకు సంబంధించి రూ.1,96,88,851 నిధుల్లో రూ.1,33,524 నిధులు దుర్వినియోగం అయినట్లు తమ దృష్టికి వచ్చిందని డీఆర్‌డీఓ పేర్కొన్నారు. వారంలోగా ఈ డబ్బులు రికవరీ కావాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ పీడీ శిరీషా, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, పీఆర్ఏఈ కళ్యాణ్, శ్రీకాంత్, ఏపీఓ గుండు వెంకన్న, ఈసీ చారి, పంచాయతీ కార్యదర్శులు, సామాజిక తనిఖీ బృంద సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవి అవతారంలో దుర్గామాత



తిరుమలగిరిలో కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు



అర్వపల్లి : కోడూరులో దుర్గాదేవికి కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

తిరుమలగిరి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా శుక్రవారం అమ్మవారు మహాలక్ష్మి అవతారంలో దర్శనం ఇచ్చారు. తిరుమలగిరిలోని తెలంగాణ చౌరస్తాలోని దుర్గామాత మండపం వద్ద మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. పాత గ్రామంలోని మండపం వద్ద మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్ ప్రత్యేక పూజలు చేశారు.

భక్తి భావం పెంపొందించుకోవాలి

నాగారం : ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్ అన్నారు. శుక్రవారం వర్ధమానుకోట గ్రామంలో దుర్గామాత విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కల్లెట్లపల్లి ఉప్పలయ్య, గుండగాని



తిరుమలగిరి : పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే

అంబయ్య, యారాల రాంరెడ్డి, ఈరేటి అంజి, మాజీ ఎంపీటీసీ వడ్డే పరశురాములు, ఈదుల కిరణ్, బండగొర్ల ఎల్లయ్య, చిత్తలూరి యాదగిరి, చిల్లర చంద్రమౌళి, మల్యాల అశోక్, కూరం వెంకన్న, భక్తులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : కోడూరులో దుర్గాదేవి విగ్రహానికి మహిళలు శుక్రవారం కుంకుమ పూజ నిర్వహించారు. అలాగే జాజిరెడ్డిగూడెంలోని గౌడ్స్‌కాలనీలో అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ గ్రామాల్లో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని గ్రామాలలో దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు శుక్రవారం మహాలక్ష్మీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమంలో అర్చకులు వరదరాజు కన్నయ్య, భక్తులు నర్సయ్య, యాకయ్య, నరేష్, చిరంజీవి, కాశీం, లింగయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



నాగారం : వర్ధమానుకోటలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని గౌడ్స్‌కాలనీలో దుర్గాదేవికి పూజలు చేస్తున్న భక్తులు



మద్దిరాల : కుక్కడంలో అమ్మవారి వద్ద ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాలధారులు

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



నూతనకల్ : రైతులకు మందులు పంపిణీ చేస్తున్న గిరిధర్‌రెడ్డి, వ్యవసాయ అధికారులు

నూతనకల్ : గ్రామాల్లో నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం మిర్యాల గ్రామంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన పశు వైద్యశిబిరంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, దరిపెల్లి వీరన్న, పసుల అశోక్ యాదవ్, అనంతుల శ్రీను, ఇరుగు కిరణ్, కనకటి వెంకన్న, నగేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : మండల పరిధిలోని తూర్పుగూడెంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ గిరిధర్ రెడ్డి మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా పశు వైద్యాధికారుల సలహాలు సూచనలు పాటించాలని అన్నారు. అనంతరం డాక్టర్ వెంకన్న మాట్లాడుతూ.. పశువులకు వచ్చే గర్భాశయ వ్యాధుల గురించి రైతులకు వివరించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట వెంకన్న, డాక్టర్ రవి ప్రసాద్, నరేష్, సిబ్బంది రాజశేఖర్, రవి, గోపాలమిత్రలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీను, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో తుంగతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్లు బానోత్ శ్రీనివాస్, కొమ్ము వెంకన్న, పాక అమృతమల్లు, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు తీకుల సుధాకర్‌రెడ్డి, మామిడి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బతుకమ్మ వేడుకలు



అర్వపల్లి : ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మలతో సిబ్బంది



నూతనకల్ : బతుకమ్మలతో తరలివెళ్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

అర్వపల్లి : అర్వపల్లి పీహెచ్‌సీలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జాజిరెడ్డిగూడెం మండల వైద్యాధికారి డాక్టర్ భూక్యా నగేష్‌నాయక్ మాట్లాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ అని అన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.బిచ్చునాయక్, డాక్టర్ ఉదయ్, నర్సింగ్ అధికారులు సునీత, కళమ్మ, మాధవి, ఎల్‌టీ చొక్కయ్య, సిబ్బంది అనూష, సరస్వతి, శకుంతల, నాగరాణి, ఊర్మిళ, శ్వేత, నీరజ, శైలజ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వ ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలను గ్రామ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్రితారెడ్డి, డాక్టర్ లిఖిత్, సీహెచ్‌ఓ శరణ్‌నాయక్, చిన్ని, శైలజ, మౌనిక, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలను నాగారంబంగ్లాలో నిర్మించాలి

నాగారం : మండలానికి మంజూరైన తహసీల్దార్, పోలీస్‌స్టేషన్, మండల పరిషత్ వంటి ప్రభుత్వ కార్యాలయాలను మండలంలోని చుట్టు పక్కల గ్రామాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా నాగారంబంగ్లాలో నిర్మించాలని వర్ధమానుకోట గ్రామానికి చెందిన మండల యువజన కాంగ్రెస్ నాయకుడు గంట మహేందర్ యాదవ్ శుక్రవారం తహసీల్దార్ హరికిషోర్‌శర్మకు వినతిపత్రం అందజేశారు. వర్ధమానుకోట, మాచిరెడ్డిపల్లి, ఈటూరు, పేరబోయినగూడెం, నర్సింహులగూడెం, ఫణిగిరి, మామిడిపల్లి తదితర గ్రామాలకు రవాణా సౌకర్యం అందుబాటులో ఉండే నాగారంబంగ్లాలోనే కార్యాలయాలు నిర్మించాలని కోరారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తి దారుణ హత్య

- కత్తులు, గొడ్డళ్లతో విచక్షణారహితంగా హత్య చేసిన నిందితులు
- జిల్లా కేంద్రంలోని కుసుమవారిగూడెం సమీపంలో ఘటన
- ఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

సూర్యాపేటటౌన్ : పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేసిన సంఘటన జిల్లా కేంద్రంలోని కుసుమవారిగూడెం క్రాస్ రోడ్డులో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు, బంధువులు తెలిపిన ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన సారగండ్ల శివకుమార్ (28) కుసుమవారిగూడెం క్రాస్ రోడ్డు సమీపంలోని బెల్టు దుకాణంలో శుక్రవారం రాత్రి ఉండగా.. సూర్యాపేటకు చెందిన ముగ్గురు యువకులు కత్తులు, గొడ్డళ్లతో వచ్చి అతడిని హత్య చేసి పరారయ్యారు. గతంలో మృతుడు శివకుమార్‌తో పాత కక్షలు ఉన్న మాతంగి మధుతో పాటు మరో ఇద్దరు యువకులే ఈ హత్య చేసినట్టు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. సంఘటన స్థలాన్ని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్నకుమార్, రూరల్ సీఐ రాజశేఖర్, పోలీస్ బృందం పరిశీలించి హత్యకు గల కారణాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.